# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 103 | పేజీలు : 08 | సోమవారం | 20-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## మా హక్కులు కాదనడానికి ఆయనెవరు?

ట్రంప్ పై ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఫైర్




ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ తీవ్ర ఆగ్రహం

తమ దేశ హక్కులు లాక్కోవడానికి మీరెవరంటూ సూటి ప్రశ్న

అమెరికాకు చట్టపరమైన అధికారం లేదని స్పష్టం

ఇరు దేశాల మధ్య చర్చల్లో ఇంకా తొలగని అంతరాలు

## అభినవ ఊసరవెల్లి




రంగులు మార్చడంలో నరేంద్ర మోదీజీ అభినవ ఊసరవెల్లి: ప్రధానిపై షర్మిల ఫైర్

మహిళా బిల్లుపై ప్రధాని మోదీ రంగులు మారుస్తున్నారని షర్మిల విమర్శ

రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కుట్రేనని ఆరోపణ

చట్టాన్ని వెంటనే అమలు చేసి 543 స్థానాలకు వర్తింపజేయాలని డిమాండ్

2029 లోపు కులగణన, శాస్త్రీయ పునర్విభజన పూర్తి చేయాలని సవాల్




## ఒప్పందానికి ఒప్పుకోకపోతే విధ్వంసమే..

ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక!

ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రం, వంతెనను కూల్చేస్తామన్న అమెరికా

సోమవారం ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల మధ్య మరో విడత చర్చలు

హర్మూజ్ జలసంధిలో కాల్పుల విరమణను ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపణ

విఫలమైన గత చర్చల తర్వాత పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతలు

## తదుపరి అడుగులు ఇవే!

మహిళా బిల్లుపై కేంద్రం తదుపరి అడుగులు ఇవే!

అన్ని పార్టీలతో మరోసారి చర్చలు జరిపి ఏకాభిప్రాయం సాధించాలని యోచన

జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే రిజర్వేషన్ల అమలు

బిల్లును మళ్లీ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం




## 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'..

. దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు

9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన 16 ప్రత్యేక బృందాలు

మ్యూల్ ఖాతాలు తెరవడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ

ఫిబ్రవరిలో జరిగిన ఆపరేషన్ ఆక్టోపస్-1కు ఇది కొనసాగింపు


2




## గవర్నర్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

ఆ ఇద్దరి పేర్లు ఆమోదించాలని విజ్ఞప్తి

గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లు ఆమోదించాలని కోరిన సీఎం

ఏ సభలో సభ్యుడు కానప్పటికీ మంత్రిగా కొనసాగుతున్న అజారుద్దీన్




హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును పట్టి పిడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడమే లక్ష్యంగా లోక్‌భవన్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. తెలంగాణ యువతను,విద్యా వ్యవస్థను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం, లోక్ భవన్ కలిసి కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో

## పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలి




ఏపీ డిప్యూటీ సీఎం పవన్ త్వరగా కోలుకోవాలని కేటీఆర్ ఆకాంక్ష

సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స

## పారదర్శకంగా ఉన్నాం..

## ప్రజలకు వాస్తవాలు చేరవేయండి




పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు

ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధిలో రాజీపడటం లేదు

శిక్షణా తరగతులతో లీడర్-కేడర్ మధ్య భావోద్వేగ బంధం

ఈ నెల 29న టీడీపీ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి: సీఎం

హైదరాబాద్ పల్స్,అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో పనిచేస్తోందని, ఈ వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ప్రత్యర్థులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వ సేవల విషయంలో తాము అనుసరిస్తున్న పారదర్శక విధానాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నేతలపై ఉందని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తాజా రాజకీయ పరిణామాలపై సమీక్షించారు. రాష్ట్రం ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ

## బాణసంచా పరిశ్రమలో పేలుడు

18 మంది మృతి

తమిళనాడులోని విరుద్‌నగర్‌లోని బాణసంచా పరిశ్రమలో పేలుడు

పలువురికి తీవ్ర గాయాలు

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


2




హైదరాబాద్ పల్స్,డెస్క్

తమిళనాడులోని ఓ ప్రైవేటు బాణాసంచా కర్మాగారంలో ఘోర ప్రమాదం సంభవించింది. విరుద్ నగర్ సమీపంలోని కట్టనార్‌పట్టిలో ఉన్న ఓ బాణసంచా తయారీ పరిశ్రమలో ఆదివారం మధ్యాహ్న సమయంలో ఫ్యాక్టరీలో భారీ పేలుడు జరగడంతో 18 మంది మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. బాణాసంచా పేలుడు ధాటికి కలిగిన ప్రకంపనలు 10 కి.మీ దూరం వరకు విస్తరించాయని స్థానికులు చెబుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రస్తుతం

## మా హక్కులు కాదనడానికి ఆయనెవరు?

మొదటి పేజీ తరువాయి

ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్ హక్కులను కాలరాయడానికి ట్రంప్ ఎవరు అని ఆయన సూటిగా ప్రశ్నించారు."ఇరాన్ తన అణు హక్కులను ఉపయోగించకూడదని ట్రంప్ అంటున్నారు. కానీ ఏ నేరం కింద ఈ మాట చెబుతున్నారో వెల్లడించడం లేదు. ఒక దేశం హక్కులను లాక్కోవడానికి ఆయన ఎవరు?" అని పెజెష్కియన్ నిలదీశారు. ఈ వ్యాఖ్యలను ఆదివారం ఇరానియన్ స్టూడెంట్ న్యూస్ ఏజెన్సీ ప్రచురించగా, రాయిటర్స్ వార్తా సంస్థ నివేదించింది. ఇరాన్ తన అణు సాంకేతికతను వినియోగించుకోకుండా అడ్డుకునేందుకు వాషింగ్టన్‌కు ఎలాంటి చట్టపరమైన హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా చర్యలు ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని వాదించారు.కాగా, తాత్కాలిక కాల్పుల విరమణ బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో పెజెష్కియన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తమ అణు హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని ఇరాన్ తేల్చిచెబుతోంది.మరోవైపు, వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య అణు ఒప్పందం సహా పలు అంశాలపై రేపు మరో దఫా చర్చలు జరగవచ్చని తెలుస్తోంది. అయితే ఈ చర్చల వల్ల పెద్దగా ఉపయోగం లేదని, ఇరు పక్షాల మధ్య ఇంకా చాలా అంతరాలు ఉన్నాయని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ శనివారం రాత్రి తెలిపారు.

## తదుపరి అడుగులు ఇవే!

మొదటి పేజీ తరువాయి

దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం) అమలు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాతే రిజర్వేషన్లు అమలవుతాయని చెప్పడంపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో, ఈ అడ్డంకులను అధిగమించేందుకు కేంద్రం కొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది.ఈ బిల్లు అమలుకు సంబంధించి ఏకాభిప్రాయం సాధించేందుకు, త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలతో మరోసారి విస్తృత స్థాయి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, అందరినీ కలుపుకొని పోవాలని యోచిస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియపై నెలకొన్న గందరగోళాన్ని నివారించేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది.అయితే, జనాభా లెక్కల సేకరణ పూర్తయితేనే డీలిమిటేషన్ చేపట్టడం సాధ్యమవుతుంది. అందుకే, ముందుగా సెన్సస్ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాతే రిజర్వేషన్ల అమలు దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా మహిళా ఓటర్ల మద్దతును కూడగట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.మరోవైపు, డీలిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అవసరమైన సాంకేతిక మార్పులతో బిల్లును తిరిగి పార్లమెంటులో ప్రవేశపెట్టే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## పారదర్శకంగా ఉన్నాం.. ప్రజలకు వాస్తవాలు చేరవేయండి

మొదటి పేజీ తరువాయి

పడకుండా ముందుకెళుతున్నామని చంద్రబాబు వివరించారు. ఈ కష్టాన్ని, ప్రభుత్వం పడుతున్న శ్రమను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. ప్రభుత్వంపైనా, కూటమి పార్టీలపైనా కొందరు పనిగట్టుకుని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వివిధ మార్గాల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని స్పష్టం చేశారు."ప్రజలకు వాస్తవాలు తెలిస్తే వారే విశ్లేషించుకుంటారు. పరిపాలనలో ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని వారికి వివరిస్తే, ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టేలా ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారు" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో నాటి ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా, ప్రజలు వాస్తవాలను గ్రహించి కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడమే మన ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు.పార్టీలో నేతలకు, కార్యకర్తలకు మధ్య భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేసేందుకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు, 'కాఫీ కబుర్లు' వంటి కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తరగతుల ద్వారా పార్టీ సిద్ధాంతాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకునే అవకాశం కలుగుతోందని తెలిపారు. పార్టీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి విద్య, వైద్యం, ఉపాధి కోసం 'ఎథిక్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' అనే వ్యవస్థను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.ఈ నెల 29వ తేదీన పార్టీ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించనుందని, దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని నేతలు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అలాగే, త్వరలో జరగనున్న మహానాడు నిర్వహణ కమిటీల ఏర్పాటుపైనా కసరత్తు చేస్తున్నట్టు సీఎంకు వివరించారు.

## బాణసంచా పరిశ్రమలో పేలుడు

మొదటి పేజీ తరువాయి

సహాయక చర్యలు చేపట్టారు. పేలుడు ధాటికి బాణాసంచా తయారీ పరిశ్రమ పూర్తిగా ధ్వంసమైంది. పేలుడు తీవ్రతకు పరిసరాలు కంపించిపోయాయి. సమీప ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 30 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం.ఈ విషాధ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై ఆరా తీశారు. వెంటనే ఘటనాస్థలికి వెళ్లాలని మంత్రులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయాన్ని అందించాలని సూచించారు. మరోవైపు ఈ పేలుడు ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో భారీ ప్రాణనష్టం సంభవించడం తమను ఎంతో కలచివేసిందని తెలిపారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలి

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు.గత కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పవన్ కల్యాణ్.. శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించారు.ఈ విషయం తెలుసుకున్న కేటీఆర్.. "పవన్ కల్యాణ్ గారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆశిస్తున్నాను" అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## ఒప్పందానికి ఒప్పుకోకపోతే విధ్వంసమే..

మొదటి పేజీ తరువాయి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు మరోసారి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందానికి అంగీకరించకపోతే ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను నాశనం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య చర్చల కోసం రేపు (ఏప్రిల్ 20న) అమెరికా ప్రతినిధి బృందం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు వెళ్లనుందని వెల్లడించారు.ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "మేం చాలా న్యాయమైన ఒప్పందాన్ని ప్రతిపాదిస్తున్నాం. దానికి వారు అంగీకరిస్తారని ఆశిస్తున్నాం. ఒకవేళ ఒప్పుకోకపోతే, ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను అమెరికా కూల్చేస్తుంది. ఇకపై మంచిగా వ్యవహరించేది లేదు" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ హంతక యంత్రాంగాన్ని అంతం చేసే సమయం వచ్చిందని, గత 47 ఏళ్లుగా ఇతర అధ్యక్షులు చేయలేని పనిని తాను చేస్తానని అన్నారు.గతంలో ఏప్రిల్ 11న ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేయగా, తమపై విధించిన ఆంక్షలు ఎత్తివేసి, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని ఇరాన్ కోరింది. ఆ చర్చలు విఫలమవ్వడంతో హర్మూజ్ జలసంధిలో అమెరికా నావికాదళ దిగ్బంధనం విధించగా, దానికి ప్రతిగా ఇరాన్ ఆ జలసంధిని మూసివేసింది.కాగా, హర్మూజ్ జలసంధిలో ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ ఆదివారం ఆరోపించారు. ఫ్రాన్స్, బ్రిటన్‌కు చెందిన నౌకలపై ఇరాన్ కాల్పులు జరిపిందని తెలిపారు. జలసంధిని మూసివేయడం వల్ల ఇరాన్‌కే రోజుకు 500 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో సోమవారం జరగనున్న చర్చలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## గవర్నర్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

మొదటి పేజీ తరువాయి

గవర్నర్ పలు నిర్మాణాత్మక సూచనలు చేశారని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. విద్యార్థులు విద్యాసంస్థల్లో అడుగుపెట్టే తొలి రోజే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా దృఢ నిశ్చయంతో ఉండాలని గవర్నర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ పొందే సమయంలోనే 'మేము మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం వాటిని ప్రోత్సహించం' అని విద్యార్థుల నుంచి అధికారికంగా ప్రమాణ పత్రం తీసుకోవాలని సూచించారు.విద్యాసంస్థల్లో కేవలం చదువు మాత్రమే కాకుండా, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాలని, విద్యార్థులతో సామూహిక ప్రమాణాలు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డికి గవర్నర్? సూచించారు. మాదకద్రవ్యాల నివారణపై రాష్ట్రస్థాయిలో చైతన్యం తీసుకురావడానికి జూన్ 12న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు, యువతకు డ్రగ్స్ లేని సమాజం ప్రాముఖ్యతను వివరించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలపై రేవంత్ రెడ్డితో గవర్నర్ చర్చించారు. కేవలం డ్రగ్స్ అంశమే కాకుండా, రాష్ట్రంలోని విద్యా రంగంలో మౌలిక వసతులు, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న విద్యావేత్తల పోస్టులు, ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలపై భేటీలో చర్చకు వచ్చినట్లుగా తెలిసింది. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా విద్యా సంస్థల పనితీరు ఉండాలని పేర్కొన్నారు.గవర్నర్ చేసిన ప్రతిపాదనల పట్ల రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. ఆయన సూచించిన విధంగా అడ్మిషన్ల సమయంలో అఫిడవిట్లు తీసుకోవడం, విద్యార్థులతో ప్రమాణం చేయించడం వంటి అంశాలను తక్షణమే అమలు చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జూన్ 12న జరగబోయే కార్యక్రమానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి నెలకొన్న ఉత్కంఠను తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న మహమ్మద్ అజారుద్దీన్ పదవికి ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. రాజ్యాంగం ప్రకారం, ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ కాకుండా మంత్రిగా ప్రమాణం చేసిన వ్యక్తి, ఆరు నెలల లోపు ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ మంత్రి పదవి చేపట్టి ఈ నెల 30 నాటికి ఆరు నెలలు పూర్తి కానున్నాయి. ఒకవేళ ఈలోగా గవర్నర్ ఆయన ఎమ్మెల్సీ నియామక ఫైల్‌పై సంతకం చేయకుంటే, ఆయన తన మంత్రి పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది.శనివారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గవర్నర్‌ను కలిసి రాజ్యాంగపరమైన చిక్కులు రాకుండా వివరణ ఇచ్చారు. గతంలో కోర్టులో ఉన్న సాంకేతిక ఇబ్బందులు తొలగిపోయినందున, తక్షణమే ఆమోద ముద్ర వేయాలని గవర్నర్?ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## అభినవ ఊసరవెల్లి

మొదటి పేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినవ ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారని, 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అసలు ద్రోహి ఆయనేనని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నారీశక్తి ముసుగులో డీలిమిటేషన్ బిల్లును తెరపైకి తెచ్చిన కపట సూత్రధారి మోదీ అని, ఇప్పుడు ప్రతిపక్షాలపై పెడబొబ్బలు పెడుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆమె విమర్శించారు.సోషల్ మీడియాలో ఆమె స్పందిస్తూ.. "2023లో పార్లమెంట్ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే అమలు చేయకుండా, దానికి నియోజకవర్గాల పునర్విభజనతో లింకు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? మళ్లీ సవరణ బిల్లు తెచ్చి, ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని బీద ఏడుపులు ఎందుకు? రాజకీయ స్వలాభం కోసం విపక్షాలపై శాపనార్థాలు పెట్టడం దేనికి?" అని ప్రధానిని సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీకి మహిళల ఆత్మగౌరవంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, 'నారీ శక్తి వందన్ అధినియమ్-2023' చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌తో ఎలాంటి సంబంధం లేకుండా ప్రస్తుతమున్న 543 పార్లమెంట్ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు పాటించాలని కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అత్యంత శాస్త్రీయంగా జరగాలని షర్మిల అభిప్రాయపడ్డారు. "ముందుగా 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి రావాలి. ఆ తర్వాత కులగణన జరిపి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల జనాభా తేల్చాలి. ఈ గణాంకాల ఆధారంగానే డీలిమిటేషన్‌లో రిజర్వేషన్లు కేటాయించాలి. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలి. చిన్న రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలి. బీజేపీకి దమ్ముంటే 2029 ఎన్నికలలోపు ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలి" అని ఆమె సవాల్ విసిరారు."శాశ్వత అధికారం కోసం రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ కుతంత్రాన్ని అడ్డుకోవడంలో విపక్షాలు విజయం సాధిస్తే, ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు మహిళలను అడ్డుపెట్టుకుని మోదీ మాట్లాడటం సిగ్గుచేటు. 2029 ఎన్నికల్లో లబ్ధి కోసం రాష్ట్రాల సమైక్యతను దెబ్బతీయాలని చూస్తే విపక్షం గుణపాఠం చెబుతుంది" అని షర్మిల హెచ్చరించారు. చేతనైతే మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేసి చూపాలని, శాస్త్రీయ పద్ధతిలో పునర్విభజన చేపట్టాలని ప్రధాని మోదీకి, మతతత్వ బీజేపీకి, ఎన్డీఏ పక్షాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున సవాల్ విసురుతున్నానని ఆమె స్పష్టం చేశారు.

## ప్రజలకు వాస్తవాలు చేరవేయండి

మొదటి పేజీ తరువాయి

దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు.వారం రోజుల పాటు 16 ప్రత్యేక పోలీసు బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులు, మోసపూరిత లావాదేవీల కోసం తమ ఖాతాలను వాడటానికి అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, నేరగాళ్లకు ఈ ఖాతాలను అందించే ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు.ఇండస్‌ఇండ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఐదుగురు చొప్పున, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన నలుగురు చొప్పున అధికారులతో పాటు మరో ఐదు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, ఒక ల్యాప్‌టాప్, 21 షెల్ కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు.పెట్టుబడుల మోసాలు, ట్రేడింగ్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి సైబర్ నేరాలు పెరిగిపోవడంతో ఈ ఆపరేషన్ చేపట్టామని సజ్జనార్ తెలిపారు. ఫిబ్రవరి 2026లో 'ఆపరేషన్ ఆక్టోపస్-1' ద్వారా రూ. 150 కోట్ల లావాదేవీలకు సంబంధించిన 117 మందిని అరెస్ట్ చేశామని, దానికి కొనసాగింపుగా బ్యాంకు అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ ప్రారంభించామని వివరించారు. సరైన కేవైసీ ధృవీకరణ లేకుండానే మ్యూల్ ఖాతాలు తెరుస్తూ సైబర్ నేరగాళ్లకు ప్రైవేట్ బ్యాంకులు సహకరిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని కమిషనర్ పేర్కొన్నారు.

# బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్ఠాపన సన్నాహక సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ గాన కోకిల బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్టాపన సన్నాహక సమావేశం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి ఎస్.వి హోటల్ లో జరిగింది. బెల్లి లలితక్క కుమారుడు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన సన్నాహక సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు, బెల్లి లలితక్క కుటుంబ సభ్యులు, లలితక్క అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బెల్లి లలితక్క అమరురాలై ఏళు ్లగడుస్తున్నా.. తెలంగాణ సాధించుకున్నా తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన బెల్లి లలితక్క విగ్రహాన్ని నెలకొల్పుకోలేక పోవటం పట్ల విషాదం, విస్మయం వ్యక్తం చేశారు. బెల్లి లలితక్క త్యాగనిరతిని, పోరాట పటిమను ఆమె ఆశయాల సాధన కోసం కృషి చేయాలని అందరూ చేయి చేయి కలిపారు. ఆ క్రమంలోనే రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అందరూ కలిసి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం కృషి చేయాలని తీర్మానించారు. విగ్రహ ఏర్పాటుకోసం గాను.. విగ్రహ ఎంపిక కమిటీ, విగ్రహ ఏర్పాటు స్థల ఎంపిక కమిటీ, ఏర్పాటయ్యాయి. విగ్రహ ప్రదానం సన్నాహక కమిటీ సమన్వయ కర్తలుగా బెల్లి లలితక్క కుమారుడు సూర్యప్రకాష్, జన్ని వెన్నెల వ్యవహరించనున్నారు. అలాగే... బెల్లి లలితక్క జీవిత, పోరాట చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఓ పుస్తకాన్ని కూడా తీసుకురావాలని నిర్ణయించారు. పుస్తకం కోసం రచనలు, బెల్లి లలితక్కతో ఉన్న జ్ఞాపకాలు, అనుభవాలను ప్రతి ఒక్కరూ రాసి పంపాలని కోరారు.బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు. భట్టు రామచంద్రయ్య, సామ మల్లారెడ్డి, పిసిసి డెలిగేట్ తంగెళ్లపల్లి రవికుమార్, పూస శ్రీనివాస్, భువనగిరి శ్రీనివాస్ నేత, శ్రీనివాసా చార్యులు, దయ్యాల రామనర్సయ్య, ఏశాల అశోక్, పుట్ట వీరేష్ యాదవ్, ఎల్లముల జంగయ్య, పాశపాక మహేశ్, ఆరుముళ్ల రమేష్, శ్రీరాం మురళికృష్ణ, చిలుకల రమేష్, ఊదరి సతీష్, ఏషాల అశోక్, నక్కల చిరంజీవి యాదవ్, కైరం కొండ వెంకటేష్, పాక జహంగీర్, ర్యాకల రమేష్, రాసాల బాలస్వామి, రాసాల దయాకర్, రాసాల నర్సింహా, జింకల శ్రీనివాస్ యాదవ్, మేకల బాలు, శ్రీరామ్ శరత్, ఎండి బాబు, రామ్ రాజ్, భరత్, ముక్కర్ల వెంకటేష్,శ్రీనివాస్, మహేష్, రఫియొద్దీన్, మేకల ఆంజనేయులు, శ్రీశైలం తదితరులు హాజరయ్యారు.

# మహిళా బిల్లు వ్యతిరేకి కాంగ్రెస్.....

**బిజెపి పట్టణ అధ్యక్షులు నంద గంగేష్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భారత పార్లమెంట్ లో మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీనీ వ్యతిరేకిస్తూ ఆదివారం ఆలేరు పట్టణ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు నంద గంగేష్ ఆధ్వర్యంలో రైల్వే గేటు వద్ద పార్టీ శ్రేణులు నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు నంద గంగేష్ మాట్లాడుతూ మహిళా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి, మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు కూడా ఆమోదించి ఉంటే వారికీ గౌరవం దక్కేది. రానున్న రోజుల్లోనైనా మహిళా శక్తికి చట్ట సభల్లో సముచిత స్థానం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ బిల్లును లోక్ సభ ముందుకు తీసుకువచ్చిన ప్రక్రియను ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు మద్దతు ఇవ్వడం జరిగింది. కానీ కాంగ్రెస్ కూటమి పార్టీలు మాత్రం అడ్డుకున్నాయి. దీని ద్వారా మహిళా వ్యతిరేకిగా, మహిళా ద్రోహిగా మిగిలిపోయారు. మహిళలు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి అన్నారు. ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే యావత్ భారత మహిళలు ఎంతో సంతోషించి ఉండేవారు. దేశ మహిళల గౌరవం, హక్కుల కోసం చారిత్రాత్మకమైన 33% మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన ఇండి కూటమి (కాంగ్రెస్) దురుద్దేశపూరిత ఆలోచనలను బీజేపీ తరుపున ఖండిస్తూన్నమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకరి సృజన్ కుమార్ గౌడ్, జిల్లా కార్యదర్శి కామటికారి కృష్ణ, జిల్లా నాయకులు చిరిగే శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు సుక్కరాజు, మండల కార్యదర్శి శక్తి కేంద్ర ఇన్చార్జ్ పూల హనుమంత్, సీనియర్ నాయకులు సముద్రాల శ్రీనివాస్, తోట మల్లయ్య, మర్రెడ్డి నరసింహారెడ్డి, తోట వెంకటయ్య, గుర్రం నరసింహులు, జూకంటి సంపత్, సబ్బని సుభాష్, పపూల హనుమంతు, మండల కార్యదర్శి బైరి మహేందర్ గౌడ్, చిలుగూరి నరసింహా రెడ్డి, ఎగ్గిడి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వంగపల్లి కురుమ సంఘం నూతన అధ్యక్షుడిగా అచ్చిన మల్లయ్య





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో శ్రీ బీరప్ప కామరాతి ఆలయంలో కురుమ సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. పరిశీలకులు మాజీ కురుమ సంఘం అధ్యక్షులు రేగు బాలనర్సయ్య, ఎన్నికల అధికారి కల్లేపల్లి శ్రీశైలం, ఉపసర్పంచ్ చిన్నం మల్లయ్య పర్యవేక్షణలో కురుమ సంఘం సభ్యులందరూ కలిసి నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురుమ సంఘం అధ్యక్షుడిగా అచ్చిన మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా జోగు మహేష్ ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు అందరూ కలిసిమెలిసి ఉండాలని అన్ని కార్యక్రమాలలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కుల పెద్దలు సూచించారు. కురుమ సంఘం గ్రామ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన అచ్చిన మల్లయ్యను సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలు రాజకీయంగా చైతన్య వంతులై ఐక్యంగా ఉండాలన్నారు. కురుమల హక్కుల సాధనకు, వారి అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం యూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుజ్జ సిద్ధులు, ప్రధానకార్యదర్శిగా జోగు భాను ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో పెద్ద కురుమ గోధుమ బీరయ్య, శెలువోజి జోగు చంద్రయ్య, వార్డు సభ్యులు చిన్నం మల్లేష్, కళ్ళే వినోద్, కుల సభ్యులు అచ్చిన కృష్ణస్వామి, ఒగ్గు నవీన్, ఏడపల్లి మహేష్, జోగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెస్తా

**రాజకీయాల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత కల్పించాలి**

**ఐక్యంగా ఉంటూ సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలి**

**వైశ్య కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలి**

**రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ**



**హైదరాబాద్ పల్స్ న్యూస్ ఏప్రిల్ 19, సిద్దిపేట జిల్లా :** రాష్ట్రంలో ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తేవడంతో పాటు ఆర్య వైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని రాష్ట్ర పారిశ్రామిక సంస్థ మాజీ చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా నాచగిరి శ్రీలక్ష్మి నృసింహ క్షేత్రంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సేవా కార్యక్రమాల్లో నిత్యం ముందుంటున్న ఆర్య వైశ్యులకు సామాజిక భద్రత అవసరం కాగా, ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చుని తెలిపారు. ప్రధానంగా చట్టసభల్లో రాజకీయ ప్రాతినిథ్యం లోపించిందని, దీనిని దృష్టిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్య వైశ్యులు ముందుండాలని ఆకాంక్షించారు. పేద ఆర్యవైశ్య యువత, విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుండగా, వైశ్య కార్పొరేషన్ కు నిధులు కేటాయించి పేద ఆర్యవైశు ్యలను ఆదుకోవాలని కోరారు. అయితే ఆర్యవైశ్య మహాసభ నేతృత్వంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక, సంక్షేమ అంశాలు ప్రధాన డిమాండ్ గా ప్రభుత్వం ముందు ఉంచుతున్నట్లు చెప్పారు. ఆర్యవైశ్య మహిళలు సైతం సేవా, ఆధ్యాత్మిక, ధార్మిక రంగాల్లో ముందుంటున్నట్లు వివరించారు. కాగా మొదటగా ఆర్యవైశ్య జిల్లా మహిళా విభాగం రూపొందించిన శ్రీ వాసవి మాత పారాయణం పుస్తకాన్ని ఆవిష్కరించగా, ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, రాష్ట్ర మహాసభ కార్యదర్శి శ్రీనివాస్ గుప్త, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నాకర్ గుప్త, అన్నదాన సత్ర చైర్మన్ కొమురవెల్లి శంకరయ్య గుప్త, మండల శాఖ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంకటయ్య గుప్త, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గుప్త, ప్రధాన కార్యదర్శి హరినాథ్ గుప్త, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు మాధవి గుప్త, ప్రధాన కార్యదర్శి లతా గుప్త తదితరులు పాల్గొన్నారు.

# విశ్వాగురు మహాత్మా బసవేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, నారాయణఖేడ్ :**
నారాయణఖేడ్ నియోజికవర్గం: ఎకంగ్టి మండలంలోని చప్తా (కే) గ్రామంలో సమస్త గ్రామ భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వాగురు మహాత్మా బసవేశ్వర విగ్రహావిష్కరణ ఢ చక్రి భజన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ ముఖ్య అతిథిగా హాజరై, బసవేశ్వర స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు.తదనంతరం ఏర్పాటు చేసిన వేదికపై మల్లన్న గుట్ట మహారాజ్ బసవలింగ మహారాజ్ తో కలిసి ద్వీప జ్యోతిని వెలిగించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, 12వ శతాబ్దపు మహానుభావుడు, సామాజిక సంస్కర్త, కవి మరియు లింగాయత్ ధర్మ స్థాపకుడు అయిన మహాత్మా బసవేశ్వరుడు సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షలను వ్యతిరేకించి సమ సమాజ స్థాపనకు కృషి చేశారని అన్నారు. “దేహమే దేవాలయం” అనే సందేశాన్ని ప్రజలకు అందించిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజికవర్గ ప్రజలు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మల్కాజిగిరి బాధ్యతలు కౌశల్ సమీర్‌కు - పార్టీ శ్రేణుల్లో ఆనందం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19 :**
కె.కె.సి రాష్ట్ర చైర్మన్ శ్రీ కౌశల్ సమీర్‌ను మల్కాజిగిరి అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించడంతో పార్టీ వర్గాల్లో సంతోషం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు రాష్ట్ర నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు.టి రాజశేఖర్ రెడ్డి, మున్న జానీ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్ జిలాని తదితరులు చైర్మన్ నివాసంలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కౌశల్ సమీర్‌కు ఉన్న నాయకత్వ నైపుణ్యం, సంస్థ పట్ల ఉన్న అంకితభావం ఈ బాధ్యతను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు తోడ్పడుతాయని అన్నారు.మల్కాజిగిరి ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఆయన కృషి మరింత ఊపునిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్త బాధ్యతల్లో ఆయన విజయపథంలో సాగాలని ఆకాంక్షిస్తూ మరోసారి శు భాకాంక్షలు తెలిపారు.

# హిందూ సమ్మేళన ఆహ్వానము కరపత్రం ఆవిష్కరణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, ఉప్పుగూడ :**
ఈనెల 25 ఏప్రిల్ 2026 శనివారం సాయంత్రం జరగబోయే హిందూ సమ్మేళన కార్యక్రమం యొక్క కరపత్ర ఆవిష్కరణ లలితా బాగ్ బస్తీలోని లలితాంబిక దేవాల ప్రాంగణంలో కరపత్ర ఆవిష్కరణ చేయడం జరిగింది. దేశానికి ఆత్మ హిందూ ధర్మం, హిందూ సంస్కృతీ మరియు హిందూ సమాజం. కావున హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరిచి మన దేశాన్ని తిరిగి విశ్వగురువుగా నిలపాలనే లక్ష్యంతో నేటి కాలమాన పరిస్థితుల్లో ఎదురౌతున్న అనేక సవాళ్ళను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత అవసరం. హిందూ సమాజం పట్ల గౌరవభావం, ఏకత్మతా భావన, స్వధర్మం పట్ల అంకితభావం, సేవాగుణం వంటి వాటిని వికసింపచేసేందుకు మీ అందరి భాగస్వామ్యాన్ని కోరుకుంటూ హిందూ సమ్మేళనం ఏర్పాటు చేయడమైనది. ఈ హిందూ సమ్మేళన కార్యక్రమంలో మనం కుటుంబ సమేతంగా పాల్గొనాలని సాదరంగా ఆహ్వానిస్తున్నాం. కావున ఈ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరూ హాజరు కావాలని హిందూ సమ్మేళన లలితాబాద్ బస్తి కమిటీ సభ్యులు తెలియజేయడం జరిగింది.

## బంచరాయితండలో మానవతా స్ఫూర్తి తో సతీష్ కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ అండ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, మహబూబాబాద్ ప్రతినిధి** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానోత్ సతీష్ (తండ్రి బిక్కు) వడదెబ్బకు గురై మృతిచెందడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో గ్రామంలోని "హెల్పింగ్ హ్యాండ్స్" సేవా బృందం ముందుకు వచ్చి తమ సహానుభూతిని చాటుకుంది. సతీష్ కుటుంబానికి ఆదివారం రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి, వారి బాధలో భాగస్వాములయ్యారు. ఏప్రిల్ 11 రాత్రి సుమారు 11 గంటల సమయంలో సతీష్ అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు సభ్యులు తెలిపారు. రోజువారీ కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్న సతీష్ అకస్మాత్తుగా మృతి చెందడం కుటుంబానికి తీరని లోటుగా మారింది.సతీష్‌కు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా, కుటుంబం మొత్తం అతని ఆదాయంపై ఆధారపడి ఉండేది. ఈ నేపథ్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యులు వెంటనే స్పందించి సహాయం అందించడం గ్రామస్తుల ప్రశంసలను అందుకుంది.గత ఏడు సంవత్సరాలుగా ఈ సేవా బృందం నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం, మరణించిన కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామంలో సేవా భావాన్ని పెంపొందిస్తోంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి కష్టకాలాల్లో ముందుండి సహాయం అందిస్తామని సభ్యులు పేర్కొన్నారు. గ్రామంలోని పేదలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.

## మార్గమధ్యంలో అంబులెన్స్‌లో ప్రసవం... 108 సిబ్బంది సేవలు ప్రశంసనీయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, మహబూబాబాద్ ప్రతినిధి :** బయ్యారం మండలంలో 108 అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా స్పందించి గర్భిణికి అంబులెన్స్‌లోనే విజయవంతంగా ప్రసవం నిర్వహించి తల్లి, శిశువును కాపాడారు.సుద్ద రేవు గ్రామానికి చెందిన పూనం యమున (27)కు శనివారం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే ఆమె భర్త వెంకన్న 108 అంబులెన్స్ సేవలను సంప్రదించారు. సమాచారం అందుకున్న వెంటనే పైలట్ ఉపేందర్, ఈఎంటి శ్రీను గ్రామానికి చేరుకుని ఆమెను ఆసుపత్రికి తరలించడం ప్రారంభించారు. అయితే మార్గమధ్యంలోనే నొప్పులు ఎక్కువ కావడంతో పరిస్థితిని అర్థం చేసుకున్న సిబ్బంది అంబులెన్స్‌ను నిలిపి, డాక్టర్ వినయ్ ఫోన్ ద్వారా ఇచ్చిన సూచనలతో డెలివరీ కిట్ ఉపయోగించి ప్రసవం నిర్వహించారు. ఈ సందర్భంగా యమున ఆరోగ్యవంతమైన మగ శిశువుకు జన్మనిచ్చింది.అనంతరం తల్లికి గ్లూకోజ్ అందిస్తూ, శిశువుకు ఆక్సిజన్ సదుపాయం కల్పించి ఇద్దరినీ సురక్షితంగా మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. ఈ సంఘటనలో సేవాభావంతో వ్యవహరించిన 108 సిబ్బంది శ్రీను, ఉపేందర్‌ను వైద్యులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు. సమయానికి స్పందించకపోతే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ని కలిసిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ పల్లె శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఏఐసీసీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు హన్మకొండ జిల్లా పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ని పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ పల్లె శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ కమిటిల గురించి చర్చించినట్టు తెలిపారు.

## తేనె అనుకుని పురుగుమందు సేవించి కూలీ మృతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, మహబూబాబాద్ ప్రతినిధి :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఓ కూలీ కార్మికుడు ప్రమాదవశాత్తు పురుగుమందు తాగి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం, దంతేవాడ జిల్లా నివాసి హిడ్మా సోరి (46) మామిడికాయలు కోయుటకు బలపాల గ్రామానికి వచ్చి కూలీ పనులు చేస్తున్నాడు. అతనికి ప్రతి రోజు రాత్రి తేనే తాగే అలవాటు ఉండగా, నిన్న రాత్రి సుమారు 8 గంటల సమయంలో తేనె అనుకుని పక్కనే ఉన్న డబ్బాలో ఉన్న పురుగుమందును పొరపాటున తాగాడు. గంట తర్వాత కడుపునొప్పితో బాధపడుతూ తాను తాగింది పురుగుమందు అని గ్రహించిన హిడ్మా, తనతో వచ్చిన బంధువులకు విషయం తెలిపాడు.వారు వెంటనే అతడిని మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో అతడు మృతి చెందాడు.మృతుని అల్లుడు ముడమి దేవా ఫిర్యాదు మేరకు కురవి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కూలీ కోసం వచ్చిన మృతుని ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, మృతదేహాన్ని స్వగ్రామమైన దంతేవాడకు తరలించేందుకు రూ.5,000 ఆర్థిక సహాయం కురవి ఎస్ఐ సతీష్ అందించారు.ఈ కార్యక్రమంలో కురవి రెండో ఎస్ఐ జయకుమార్, పీసీలు హరిబాబు, రమేష్ పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై వివాదం

**రెబ్బెన మండలంలో బీజేపీ నిరసన, ఉద్రిక్త పరిస్థితులు....**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాజకీయ వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించింది.రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు నిర్వహించిన ఈ ఆందోళనలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు మాట్లాడుతూ మహిళలకు న్యాయం చేయాల్సిన సమయంలో కాంగ్రెస్ వ్యతిరేక వైఖరి అవలంబించిందని విమర్శించారు.నిరసన కార్యక్రమం తీవ్రతరమవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పలువురు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో కొంతసేపు ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## బాలాజీ అనుకోడాలో మాలి సంఘం నూతన కమిటీలు ఎన్నిక....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం బాలాజీ అనుకోడా గ్రామంలో మాలి సంక్షేమ సంఘం, మాలి యువజన సంఘం నూతన కమిటీలు ఏకగ్రీవంగా ఏర్పాటయ్యాయి. మండల అధ్యక్షులు నీకోడే సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నికలు చేపట్టారు.మాలి సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షులుగా ఆదే పోశన్న, ప్రధాన కార్యదర్శిగా బోర్లే శంకర్, ఉపాధ్యక్షుడిగా రమేష్, కోశాధికారిగా వినోద్, సలహాదారులుగా కొట్రంగి భీంరావు, మధుకర్ ఎంపికయ్యారు. యువజన సంఘం అధ్యక్షుడిగా అంజన్న, ప్రధాన కార్యదర్శిగా నీకోడే తోగయ్య, ఉపాధ్యక్షుడిగా కార్తీక్, కోశాధికారిగా హనుమంతు, సలహాదారులుగా మల్లేష్, రాజన్న ఎన్నికయ్యారు.నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్లే శ్రీనివాస్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే బీర్ల పై లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదు....

**కాంగ్రెస్ నాయకులు పెంట గోపాల్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య ని విమర్శించే స్థాయి బిఆర్ఎస్ నాయకులకు లేదు అని రాజపేట మండలం బేగంపేట కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పెంట గోపాల్ విలేకర్లతో మాట్లాడుతూ... రాజపేట మండలంలోని చల్లూరు గ్రామంలోని 322 సర్వేనెంబర్ లో ఉన్న క్రషర్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి సంబంధం ఉందని వస్తున్న ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నన్నరు అసలు గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో చల్లూరు గుట్టలలో ఉన్న క్రాషర్లు 10 సంవత్సరాలుగా నడిపించారు గతంలో ఉన్నవారే అన్న విషయాన్ని గుర్తించి మాట్లాడాలని హితావుపలికారు యాదాద్రి భువనగిరి జిల్లాలో అక్రమ మైనింగ్ గురించి తెలిసిన వెంటనే సంబంధిత అధికారులను అరికట్టాలని బీర్ల ఐలయ్య మీడియా సమావేశం నిర్వహించి జిల్లా మైనింగ్ అధికారులను ఆదేశించిన విషయాన్ని బిఆర్ఎస్ నాయకులు గుర్తించాలని పేర్కొన్నారు లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదని అన్నారు.

## కొలనుపాకలో నియో విజన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** నియో విజన్ ఐ కేర్ ఢ లేజర్ సెంటర్ హాస్పిటల్, హబ్సిగూడ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఆలేరు మండలంలోని కొలనుపాక రైతు వేదికలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు, కంటి వైద్యురాలు ఎస్ మౌనిక మాట్లాడుతూ.. క్యాంప్ ద్వారా ఉచిత శాస్త్ర చికిత్స అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్లు కార్తీక్, ఉపేందర్, వైద్య సిబ్బంది మహమ్మద్ కయుద్దిన్, అనూష, స్వామి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 22 నుంచి ఆర్టీసీ నిరవధిక సమ్మె పిలుపు.....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**
ఆసిఫాబాద్ జిల్లాలో ఆర్టీసీ సమస్యల పరిష్కారం, సంస్థ రక్షణ కోసం ఏప్రిల్ 22 మొదటి డ్యూటీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు జేఏసీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆసిఫాబాద్ డిపోలో జరిగిన గేట్ మీటింగ్‌లో కార్మికులు సమ్మెలో పాల్గొనాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు.ప్రభుత్వ హామీలు అమలు కాకపోవడం వల్లే సమ్మెకు దిగుతున్నామని పేర్కొన్నారు. వేతన సవరణ, ప్రభుత్వంలో విలీనం, బకాయిల చెల్లింపు, ఉద్యోగ భద్రత, ప్రైవేటీకరణ నిలిపివేత, ఖాళీల భర్తీ వంటి డిమాండ్లు ప్రధానంగా ఉన్నాయి. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు.

# అక్షరాస్యత పెంపు ద్వారా సామాజిక మార్పు సాధ్యం

## రాజంపేటలో అక్షరాస్యతకు నూతన దిశ వయోజన విద్య కేంద్రం ప్రారంభం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం రాజంపేట గ్రామపంచాయతీలోని నవజీవన్ ప్రార్థన మందిరంలో గ్రామ అక్షరాస్యత పునరావాస కార్యక్రమం, వయోజన విద్య కేంద్రాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. లిటరసీ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఎంఈఓ సుభాష్, సర్పంచ్ పోచయ్య, ఉప సర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పరధాన్, గోండి కమ్యూనిటీలలో అక్షరాస్యత పెంపు ద్వారా సామాజిక మార్పు సాధ్యమని తెలిపారు. 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో అక్షరాస్యత కోసం అవసరమైన పుస్తకాలు, స్టేషనరీ కిట్లు యానిమేటర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని పాస్టర్ బి జయరాజ్, బి నిఖిల్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మల్లికార్జున కార్గే పై అనుచిత వాక్యాలు చేసిన అస్సాం సీఎం ని వెంటనే శిక్షించాలి

## దళితుల ఆత్మ గౌరవాలను రెచ్చగొట్టేలా ఉన్నాయి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్లో జాతీయ తెలంగాణ మాల మహానాడు జిల్లా కమిటీ అధ్యక్షులు పరుస వెంకటేష్, ప్రధాన కార్యదర్శి, తౌటి తిరుపతి, ఉపాధ్యక్షులు మల్లె పెల్లి రాజ నరసయ్య అస్సాం ముఖ్యమంత్రిని శిక్షించాలి అని ఫిర్యాదు చేశారు. అనంతరం జాతీయ తెలంగాణ మాల మహానాడు ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తౌటి తిరుపతి మాట్లాడుతూ ఈనెల ఏడవ తేదీన జాతీయ దళిత నాయకుడు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే పై అస్సాం ముఖ్యమంత్రి చేసిన అనుచిత వాక్యాలు దళితుల గౌరవాన్ని భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఘాటుగా విమర్శించారు. యావత్ దేశంలో ఉన్నటువంటి దళితులందరినీ అవమానించి కించపరిచే విధంగా ఉన్నాయని ఆయన అన్నారు.

# ఆడెపు నరహరి కుటుంబానికి జైశ్రీరామ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండల కేంద్రంలోని ఇటీవల మరణించిన ఆడెపు నరహరి కుటుంబానికి జైశ్రీరామ్ ఫౌండేషన్ సభ్యులు రూ,5000 రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబానికి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోయ మధు, మాజీ ఎంపిటిసి దాచేపల్లి రాజు, చలమలపల్లి లక్ష్మణ్, కాకల్ల సిద్ధులు, సాధనబోయిన శంకర్, సకినాల చిరంజీవులు, ఆడేపు రామకిష్ఠయ్య, ఆడేపు ఉపేందర్, అడేపు శ్రీశైలం, అడేపు శేఖర్, అడేపు గణేష్, ఐలయ్య, చుంచునారాయణ, వెంగల్దాస్ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకుంటున్న జైశ్రీరామ్ ఫౌండేషన్ సభ్యుల సేవలను గ్రామస్తులు కొనియాడారు

# ఫీజుల వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలి : డీఎస్ఎఫ్ఐ డిమాండ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, మహబూబాబాద్ ప్రతినిధి :**
ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను మానసికంగా వేధిస్తున్న ఘటనలను డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండించింది. విద్యా సంవత్సరం ముగింపు సమయంలో బకాయిల పేరుతో విద్యార్థులను తరగతి గదుల బయట నిలబెట్టడం, హాస్టళ్ల నుంచి వెళ్లనీయకపోవడం వంటి చర్యలు అమానవీయమని పేర్కొంది.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు గుగులోతు సూర్య ప్రకాష్ , ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ, మధ్యతరగతి కుటుంబాలపై భారాన్ని మోపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేసి, సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే పలుమార్లు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేదని ఆయన తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్న అదనపు ఫీజులను నియంత్రించాలని, ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఫీజుల వేధింపులు తీవ్రమై విద్యార్థులు తీవ్ర నిర్ణయాలకు దారి తీసే పరిస్థితి రాకముందే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అలా జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని డీఎస్ఎఫ్ఐ హెచ్చరించింది.

# డోర్నకల్‌లో ఆశా కార్యకర్తల సంఘం కొత్త కమిటీ బాధ్యతలు స్వీకారం

## సమస్యల పరిష్కారంపై స్పష్టమైన డిమాండ్లు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, మహబూబాబాద్ ప్రతినిధి :**
డోర్నకల్ మండలంలో ఆశా కార్యకర్తల సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. వైద్య ఆరోగ్య శాఖకు అనుబంధంగా ఉన్న కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మండలంలోని ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అనిత, ప్రధాన కార్యదర్శిగా స్రవంతి, కార్యదర్శిగా నిర్మల, ఖజానాదారిగా నాగరాణి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షురాలిగా యల్లావుల సువర్ణను ఎంపిక చేశారు.సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెలకు పద్దెనిమిది వేల రూపాయల జీతం అమలు చేయడం, సహాయక నర్సు శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు కల్పించడం, విధుల్లో మరణించిన ఆశా కార్యకర్తల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించడం వంటి పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు.ఈ సందర్భంగా పదమూడు వ వార్డు కౌన్సిలర్ యల్లావుల సువర్ణ హరికృష్ణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలను స్థానిక శాసన సభ్యుడు రామచంద్ర నాయక్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం వరకు చేరవేస్తామని తెలిపారు. తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.



అనంతరం ఇరవై సంవత్సరాల పాటు ఆశా కార్యకర్తగా సేవలందించి, మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా ఎన్నికైన యల్లావుల సువర్ణ హరికృష్ణను సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

# సోలార్ లైట్లు ప్రారంభం... ఇండక్షన్ పొయ్యిలు, గ్యాస్ పంపిణీ





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పలు మండలాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి పెంచికల్పేట్, బెజ్జూర్, చింతలమానేపల్లి, సిర్పూర్ మండలాల్లో ఎలక్ట్రిక్ ఇండక్షన్ పొయ్యిలు, గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి, చేతి పంపులు, సోలార్ లైట్లను ప్రారంభించారు.పెంచికల్పేట్ పరిధిలో అగరగూడ, గుండెపల్లి గ్రామాల్లో ఇండక్షన్ పొయ్యిలు పంపిణీ చేయగా, గుండెపల్లిలో సోలార్ హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. బెజ్జూర్ మండలం ఇందిర్గాం, చింతలమానేపల్లి డబ్బా, సిర్పూర్ హుడ్కిలి గ్రామాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారు.గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, వంట సౌకర్యాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ అధికారి భార్గవ్ కుమార్, ఎఫ్డీఓ అప్పయ్య, ఎఫ్ఆర్ఓలు, ఎంపీడీఓ మహేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, సర్పంచ్లు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నంతవరకు బిజెపి ఆటలు సాగవు : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్ (131వ రాజ్యాంగ సవరణ) ముసుగులో దేశ సమాఖ్య స్వరూపాన్ని దెబ్బతీయాలని చూసిన మోడీ, అమిత్ షా కుట్రలను కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వంలో పటాపంచలు చేసిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఒకవేళ పార్లమెంట్లో బిల్లు నెగ్గితే బిజెపి తమ ఘనతగా, ఓడిపోతే ప్రతిపక్షాలను టార్గెట్ చేద్దామని కుట్ర పన్నింది. గతంలో ఇలాగే 2020లో రైతులపై నల్ల చట్టాలు తెద్దామని ప్రజలలో వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో బిజెపి బొక్క బోర్ల పడింది. తెలంగాణ రాష్ట్రం తరఫున, దక్షిణాది రాష్ట్రాల ఐక్యత కోసం కృషి చేస్తున్న రేవంత్ రెడ్డి కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.2024లో రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు ఎత్తేద్దామని, బలహీన వర్గాలని దెబ్బతీయాలని కుట్ర పన్నింది. దేశంలో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ఉన్నంతవరకు బిజెపి ఆటలు సాగవు. మోదీకి కౌంట్‌డౌన్ మొదలైంది. దక్షిణాది రాష్ట్రాలకు మోదీ అన్యాయం చేయాలని చూస్తుంటే, రాహుల్ గాంధీ, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా నిలబడి ఈ రోజు బిల్లును అడ్డుకోవడం గొప్ప విషయం. ఇప్పుడున్న 543 సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేస్తే కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుంది. బిజెపి పార్టీ ప్రవేశపెట్టిన మూడు బిల్లులో మహిళా అంశం లేదు... డీలిమిటేషన్ పేరుతో మళ్ళీ అధికారంలోకి రావడం కోసం ప్రయత్నం చేస్తున్న భారతీయ జనతా పార్టీ.. వంవిాళా లోకానికి భారతీయ జనతా పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. రాజకీయ అవసరాల కోసం రాజకీయ ఎత్తుగడల కోసం మహిళలని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయాలనుకుంటే భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీకి మనుగడ ఉండదు.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా బీజేపీ వైఖరి స్పష్టంగా లేదు. ఈ బిల్లు విషయంలో బీజేపీ ద్వంద్వనీతి కనిపిస్తుంది. మహిళా బిల్లును అమలు చేయాలనే ఉద్దేశం లేకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం బిల్లును వాడుకుంటున్న విధానం నిన్న తేటతెల్లమైంది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ




వ్యాఖ్యలే ఈ విషయాన్ని బయటపెట్టాయి. బిల్లు ఆమోదం పొందకపోయినా తమకు నష్టం లేదని చెప్పడం వారి అసలు ఉద్దేశాన్ని వెల్లడిస్తుంది.. దక్షిణాది రాష్ట్రాలను బలహీనపరిచే ప్రయత్నాలను ప్రజలు గట్టిగా తిప్పికొడుతున్నారు. ఈ నేపథ్యంలో 'ఇండియా' కూటమి దేశాన్ని రక్షించే శక్తిగా నిలుస్తోంది. భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, చిన్న రాష్ట్రాల హక్కులను రక్షించడానికి మా 'ఇండియా' కూటమి పోరాటం కొనసాగుతుందన్నరు.

# అతిథి హోటల్లో నూతన యువజన కార్యవర్గ ఎన్నికల నిర్వహించడం జరిగింది



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, నారాయణ ఖేడ్ :** ఆదివారం నాడు సంగారెడ్డి జిల్లా సగర సంఘం జహీరాబాద్ లోని అతిథి హోటల్లో నూతన యువజన కార్యవర్గ ఎన్నికల నిర్వహించడం జరిగింది. ఈ యొక్క యువజన సంఘం అధ్యక్షులు మరియు యువజన బాడి యొక్క నుతన కార్యవర్గ ఎన్నిక కోసం జిల్లా నలుమూలల నుండి సగర సంఘం నాయకులు మరియు యువకులు పాల్గొనడం జరిగింది ఎన్నికలలో యువజన సంఘం అధ్యక్షుడిగా ఉప్పరి లక్ష్మణ్ సగర మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యవర్గంలో భాగంగా జిల్లా యువజన అధ్యక్షుడు లక్ష్మణ్ సగర ప్రధాన కార్యదర్శిగా శంకర్ సగర కోశాధికారిగా శ్రీకాంత్ సగర ఎన్నిక కావడం జరిగింది. యొక్క ఎన్నిక రాష్ట్ర సగర సంగం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇందులో రాష్ట్ర సగర సంగం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, మరియు జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేశ్వర సగర, మరియు జిల్లా సగర సంఘం పెద్దలు మరియు యువకులు పాల్గొన్నారు

# శ్రీ విద్యాధరీ క్షేత్రాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ హైమావతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, సిద్దిపేట జిల్లా:** అక్షయ తృతీయ పర్వదిన సందర్భంగా ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరీ క్షేత్రాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ హైమావతి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు అందజేసి అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు.

# నాయకపోడు తెగకు ప్రత్యేక వ్యక్తిగత సీరియల్ నెంబర్ ఇవ్వాలి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మండలం బూరుగుపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆదివాసీ నాయకుడు, సేనా సమితి రాష్ట్ర అధ్యక్షుడు దబ్బ సాయికుమార్ మాట్లాడుతూ.. నాయకపోడు తెగకు సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తూ పలు కీలక అంశాలను వెల్లడించారు.స్వాతంత్ర్యం వరకు నాయకపోడు తెగకు ప్రత్యేక వ్యక్తిగత గుర్తింపు సంఖ్య ఉండేదని, తరువాత గోండు తెగతో కలిపివేయడం వల్ల ఈ తెగకు అన్యాయం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం నాయకపోడు జనాభా గోండు జనాభాలో కలిసిపోవడంతో సరైన గణాంకాలు కనిపించడం లేదని తెలిపారు.దీనివల్ల ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తి స్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకపోడు తెగకు ప్రత్యేక వ్యక్తిగత సీరియల్ నెంబర్ ఇవ్వాలి నాయకపోడు జనాభాపై ప్రత్యేక సర్వే నిర్వహించాలిఈ అంశంపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సూపర్ రిచ్ కంట్రీగా భారత్.. బయటపడ్డ 42.5 టన్నుల బంగారం..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, సెంట్రల్ డెస్క్:** భారతీయులను బంగారాన్ని విడివిడిగా చూడలేం.. బంగారంతో అంత మమేకం అవుతారు మనవాళ్లు. ఫంక్షన్ ఏదైనా ఒంటి నిండా ఆభరణాలతో రెడీ అవ్వాలని కోరుకుంటారు. ఇప్పుడే కాదు అశోకుని కాలం నుంచి భారత్ బంగారంపై ఎనలేని ప్రేమని ప్రదర్శిస్తూ వస్తోంది. ఇక ప్రస్తుతం దేశంలో బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హైదరాబాద్ లో తులం బంగారం రూ. లక్షా 50 వేలకు పైనే ఉంది. దాంతో బంగారం కొనాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది. పైగా ప్రస్తుతం పెళ్లిళ్లు, శుభకార్యాలు సీజన్ కావడంతో బంగారం కొనకుండా ఉండలేని పరిస్థితి నెలకొంది. దాంతో చేసేదేంలేక రూ. లక్షలు ఖర్చు చేసి మరీ బంగారం కొనేస్తున్నారు.ఇక ఏటా భారత్ విదేశాల నుంచి దాదాపు 800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది. దీని కోసం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేస్తోంది. అయితే ఇప్పుడు భారతీయులకు గుడ్ న్యూస్. భారత్ కు జాక్ పాట్ తగిలింది. ఏపీలోని కర్నూల్ జిల్లాలో భారీ బంగారు గని బయటపడింది. కొత్త బంగారు గని వల్ల భారత ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగుపడే అవకాశం ఉంది. బంగారం దిగుమతులు కూడా తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఏపీలోని కర్నూలు జిల్లాలో దాదాపు 42.5 టన్నుల బంగారం నిల్వలు ఉన్నట్లు సమాచారం. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో.. దేశంలోనే తొలిసారిగా మొదటి ప్రైవేట్ బంగారు గని ఇదే కావడం విశేషం. దీనిని జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ఇక ఈ ప్రాంతంలో మొత్తం 42.5 టన్నుల బంగారం నిక్షేపాలు ఉన్నట్లు అంచనా.అలాగే ప్రస్తుతం తవ్వకాలకు 13.1 టన్నుల బంగారం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇక ఈ గని ద్వారా ఏడాదికి దాదాపు 1000 కిలోల స్వచ్ఛమైన బంగారాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ లో దాదాపు రూ.400 కోట్లు పెట్టుబడి పెట్టారు. ఇక ఈ గని దాదాపు 15 ఏళ్లపాటు కార్యకలాపాలు సాగిస్తుందని అంచనా..

# సుదర్శన నరసింహ కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దంపతులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట మున్నూరు కాపు సత్రం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం నిర్వహించారు.108 మంది దంపతులతో సుదర్శన నరసింహ హోమం జరిగింది. అనంతరం ఒక వెయ్యి ఎనిమిది మంది దంపతులతో లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కళ్యాణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దంపతులు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించి, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేదికలని అన్నారు. ముఖ్యంగా మున్నూరు కాపు సత్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో, భారీ స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. 108 మంది దంపతులతో హోమం, 1008 మంది దంపతులతో కళ్యాణం నిర్వహించడం విశేషమని కొనియాడారు. ప్రజలందరికీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులు లభించాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.



# దక్షిణాదికి అన్యాయం జరగనివ్వం : ప్రధాని నరేంద్ర మోడీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, సెంట్రల్ డెస్క్:** లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడంపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో, విపక్షాలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలులో ఈ సవరణ ఒక కీలక ముందడుగు అని, దీనిని అడ్డుకోవడం అంటే దేశంలోని 'నారీ శక్తి' పురోగతిని ఆపడమేనని ఆయన విమర్శించారు. అధికారం కోసం విపక్షాలు చేస్తున్న ఇటువంటి రాజకీయాలు దేశ భవిష్యత్తుకు తీరని నష్టం కలిగిస్తాయని పీఎం హెచ్చరించారు.దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రధాని మోడీ తాజా సందేశంలో స్పష్టమైన హామీ ఇచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం ఏమాత్రం తగ్గకుండా చూసేందుకే తమ ప్రభుత్వం ఈ బిల్లును ప్రతిపాదించిందని వివరించారు. ఈ బిల్లు ద్వారా సీట్ల సంఖ్యను పెంచి, అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు న్యాయం చేయాలని భావించినట్లు పేర్కొన్నారు. విపక్షాలు అడ్డంకులు సృష్టించినప్పటికీ, ప్రతి ప్రాంతానికి మరియు ప్రతి వర్గానికి న్యాయం జరిగే వరకు తమ ప్రభుత్వం విశ్రమించదని ప్రధాని మోదీ తన వీడియోలో దృఢంగా ప్రకటించారు.



# బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్ఠాపన సన్నాహక సమావేశం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ గాన కోకిల బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్టాపన సన్నాహక సమావేశం ఆదివారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి ఎస్.వి హోటల్ లో జరిగింది. బెల్లి లలితక్క కుమారుడు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన సన్నాహక సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు, బెల్లి లలితక్క కుటుంబ సభ్యులు, లలితక్క అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బెల్లి లలితక్క అమరురాలై ఏళు ్లగడుస్తున్నా తెలంగాణ సాధించుకున్నా తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన బెల్లి లలితక్క విగ్రహాన్ని నెలకొల్పుకోలేక పోవటం పట్ల విషాదం, విస్మయం వ్యక్తం చేశారు. బెల్లి లలితక్క త్యాగనిరతిని, పోరాట పటిమను ఎత్తిపట్టి ఆమె ఆశయాల సాధన కోసం కృషి చేయాలని అందరూ చేయి చేయి కలిపారు. ఆ క్రమంలోనే రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అందరూ కలిసి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం కృషి చేయాలని తీర్మానించారు.విగ్రహ ఏర్పాటుకోసం గాను.. విగ్రహ ఎంపిక కమిటీ, విగ్రహ ఏర్పాటు స్థల ఎంపిక కమిటీ, వనరుల కమిటీ ఏర్పాటయ్యాయి. ప్రధానం.. విగ్రహ సన్నాహక కమిటీ సమన్వయ కర్తలుగా బెల్లి లలితక్క కుమారుడు సూర్యప్రకాష్, జన్ని వెన్నెల వ్యవహరించనున్నారు. అలాగే... బెల్లి లలితక్క జీవిత, పోరాట చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఓ పుస్తకాన్ని కూడా తీసుకురావాలని నిర్ణయించారు. పుస్తకం కోసం రచనలు, బెల్లి లలితక్కతో ఉన్న జ్ఞాపకాలు, అనుభవాలను ప్రతి ఒక్కరూ రాసి పంపాలని కోరారు.బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సమావేశంలో పాల్గొన్న వారు భట్టు రామచంద్రయ్య, సామ మల్లారెడ్డి, పిసిసి డెలిగెట్ తంగెళ్లపల్లి రవికుమార్, పూస శ్రీనివాస్, భువనగిరి శ్రీనివాస్ నేత, శ్రీనివాసా చార్యులు, దయ్యాల రామనర్సయ్య, ఏశాల అశోక్, పుట్ట వీరేష్ యాదవ్, ఎల్లముల జంగయ్య, పాశపాక మహేశ్, ఆరుముళ్ల రమేష్, శ్రీరాం మురళికృష్ణ, చిలుకల రమేష్, ఊదరి సతీష్, ఏషాల అశోక్, నక్కల చిరంజీవి యాదవ్, కైరం కొండ వెంకటేష్, భూక్యా సంతోష్ నాయక్, పాక జహంగీర్, ర్యాకల రమేష్, రాసాల బాలస్వామి, రాసాల దయాకర్, రాసాల నర్సింహా, జింకల శ్రీనివాస్ యాదవ్, మేకల బాలు, శ్రీరామ్ శరత్, ఎండి బాబు, రామ్ రాజ్, భరత్, ముక్కర్ల వెంకటేష్,శ్రీనివాస్, మహేష్, రఫియొద్దీన్, మేకల ఆంజనేయులు, శ్రీశైలంతదితరులు హాజరయ్యారు. బెల్లి లలితక్క జీవిత చరిత్ర పుస్తకం కోసం బెల్లి లలితక్కతో పరిచయం ఉన్నవారు, ఆమెతో వారికున్న అనుభవాలు, జ్ఞాపకాల రచనలను, లేదా ఆమె పోరాట చరిత్రను రాసి లలితక్క కుమారుడు సూర్య ప్రకాష్ (9640923312), శ్రీనివాసా చార్య (9705755713) వాట్సాప్ నెంబర్లకు పంపాలని తెలియజేశారు.



హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై మేడే స్ఫూర్తితో పోరాటాలు చేయాలి

## కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా చేసి వారి హక్కులను హరించాలని చూస్తుందని మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై పోరాటాలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రోజున బూరుగు స్వప్న అధ్యక్షతన జరిగిన సిఐటియు రాజపేట మండల జనరల్ బాడీ సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ...కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలకు సవరణలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికుల జీవన విధానం మీద, వారి స్థితిగతుల మీద ప్రత్యక్షంగా దాడి చేయాలనే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని, ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను ఐసిడిఎస్, ఎల్ఐసి, టెలికం, రవాణా, రైల్వే, రక్షణ రంగాలను ప్రైవేటుపరం చేయాలనే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. కార్మికులు, ప్రజల పోరాటంతో కొంత వెనుకకు తగ్గినా కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు కార్మికుల పొట్ట కొట్టే విధంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికుల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తుందని వారు అన్నారు. సామ్రాజ్యవాద దేశంతో భారత ప్రధాని లోపాయికార ఒప్పందాలు చేసుకొని దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభం వైపు తీసుకువెళ్లుతున్నారని అన్నారు.



అనేకమంది మేధావులు, ఆర్థికవేత్తలు అమెరికా చేస్తున్న సామ్రాజ్యవాదపు పోకడలను వ్యతిరేకిస్తున్నా దేశ ప్రధాని మౌనంగా ఉండడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అమరవీరుల స్ఫూర్తితో మేడే కార్యక్రమాన్ని పండగలగా జరపాలని వారు పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉదయమే జెండాలు ఎగరవేసుకొని 9-00 గంటల వరకు రాజపేట మండల కేంద్రానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, మాధవి, వసంత, పద్మ, యాదగిరి, భాగ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతాం

## ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను అనేక ఇబ్బందులు పెడుతున్నారని రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించక పోతే రైతులతో కలిసి ఆందోళన చేయనున్నట్లు ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు హెచ్చరించారు. ఆదివారం రాజపేట లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఒక రాజపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలోని 40 కి పైగా ధాన్యం కుప్పలు రైతులకు సంబంధించినవి వారం రోజుల నుంచి ఉన్నట్లు రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, నీడ లేక అనేక ఇబ్బందులు పడుతూ వడదెబ్బకు రైతులు గురవుతున్నట్లు చెప్పారు. గన్నీ సంచులు ఇవ్వకపోవడం, తూర్పారబోసే మిషన్ పనిచేయకపోవడం, కనీసం వ్యవసాయ శాఖ అధికారులు అటువైపు తొంగి చూడకపోవడం ఎంతవరకు న్యాయమని నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే ఆర్భాటంగా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్నట్లుగా రైతులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించకపోగా, పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అవస్థలు పెట్టడం న్యాయం కాదని రైతుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని గుర్రం నర్సింలు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి పాలకులు గురికాక తప్పదని అన్నారు. గత కెసిఆర్ పాలనలో ఆలేరు



ఎమ్మెల్యే గొంగిడి సునీత నాయకత్వంలో రైతులకు సకాలంలో అవసరమైన రుణాల పంపిణీ రైతుబంధు సేద్యం కోసం సహాయ సహకారాలు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కెసిఆర్ పాలన రావాలని రైతులు కోరుకుంటున్నట్లు గుర్రం నరసింహులు చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు వేయాలని, దొడ్డు వడ్లకు కూడా మద్దతు ధర చెల్లించాలని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు డిమాండ్ చేశారు.

# రంగంలోకి భారత్.. ఇరాన్ కు సీరియస్ వార్నింగ్..

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, సెంట్రల్ డెస్క్: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఏమాత్రం తగ్గడం లేదు. ప్రపంచ దేశాలకు కీలకమైన హార్మూజ్ జలసంధి వద్ద పరిస్థితి అంతకంతకూ తీవ్ర తరం అవుతోంది. తాజాగా హార్మూజ్ జలసంధిని దాటిన భారత జెండాలు కలిగిన రెండు నౌకలను ఇరాన్ కు చెందిన గన్ బోట్స్ కాల్చేశాయి. అయితే భారత నౌకలపై దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ వైఖరి పట్ల తీవ్ర ఆందోళన, నిరసన వ్యక్తం చేసింది. ఇక ప్రపంచ దేశాల వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధిపై ఇరాన్- అమెరికా పెత్తనం చెలాయిస్తున్నాయి. ఓ వైపు హార్మూజ్ ను పూర్తిగా దిగ్బంధనం చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. హార్మూజ్ జలసంధిని పూర్తిగా మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది. హార్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్, అమెరికా వరుసబెట్టి వార్నింగ్ చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి మూసివేసిన హార్మూజ్ జలసంధిని ఇటీవల ఓపెన్ చేసినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అగార్చీ పేర్కొన్నారు. అయితే తాజాగా మరోసారి హార్మూజ్ జలసంధిని ఇరాన్ ప్రకటించింది. అంతేకాక హార్మూజ్ గుండా ప్రయాణిస్తున్న నౌకలపై ఇరాన్ కు చెందిన గన్ బోట్స్ దాడులకు పాల్పడుతున్నాయి. ఈ క్రమంలో భారత్ జెండాలు కలిగిన రెండు నౌకలపై ఇరాన్ గన్ బోట్స్ కాల్పులు జరిపాయి. ఈ విషయంలో ఇరాన్ పై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబారిని ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పిలిపించి మరీ విషయాలను అడిగి తెలుసుకుంది. ఈ మేరకు ఇరాన్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నౌకలు, సిబ్బంది భద్రత తమకు



ముఖ్యమని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇరాన్ వెంటనే దృష్టి సారించాలని పేర్కొంది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్ వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. భారత్ నౌకలు హార్మూజ్ గుండా ఇదివరకు మాదిరిగానే సేఫ్ గా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

# ఎంత ఇచ్చారంటూ..? చైనా, పాకిస్థాన్‌ను కడిగిపారేసిన ఇజ్రాయెల్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, సెంట్రల్ డెస్క్ :** ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ఇజ్రాయెల్ రాయబారి సంచలన ఆరోపణలు చేశారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ విధిస్తున్న ఆంక్షల వెనుక దేశాల "రహస్య ఒప్పందాలు" ఉన్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఫ్రాన్స్, చైనా, పాకిస్థాన్‌లను ఉద్దేశించి ఆయన సంధించిన ప్రశ్నలు దౌత్య వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.ఇరాన్ ఇతర నౌకలను అడ్డుకుంటుండగా, హోర్ముజ్ జలసంధిలో ఫ్రెంచ్ ఓడలు సురక్షితంగా ఎలా వెళ్తున్నాయి? ఫ్రాన్స్ రాయబారి బోన్‌ఫాన్‌ను ఉద్దేశిస్తూ, "ఏప్రిల్ 3న ఫ్రెంచ్ నౌక ఎలా ప్రయాణించగలిగింది? ఇరాన్‌కు ఎంత చెల్లించారు? ఆ చెక్కు మాకు చూపించండి" అని ఇజ్రాయెల్ రాయబారి నిలదీశారు. దౌత్య ప్రోటోకాల్‌ల ముసుగులో ఇరాన్‌తో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.చైనా, పాకిస్థాన్‌ల మౌనంపైనా ఇజ్రాయెల్ రాయబారి విమర్శలకు దిగారు. పాకిస్థాన్ ప్రతినిధి అహ్మద్‌ను ప్రశ్నిస్తూ, "ఇరాన్‌తో మీకు ఒప్పందం ఉంది. దాన్ని ప్రపంచంతో ఎందుకు పంచుకోవడం లేదు?" అన్నారు. చైనా నౌకలు కూడా సురక్షితంగా వెళ్లేందుకు ఇరాన్‌తో ఒప్పందం చేసుకున్నాయని, ఈ దేశాల మౌనం సందేహాలకు తావిస్తోందని ఆయన ఆక్షేపించారు.ఈ రహస్య ఒప్పందాలు అంతర్జాతీయ నియమాలను



ఉల్లంఘించి, ఇరాన్‌ను ప్రోత్సహిస్తున్నాయని ఇజ్రాయెల్ పేర్కొంది. భద్రతా మండలి వైఫల్యంగా దీన్ని అభివర్ణించిన రాయబారి, ప్రపంచ నౌకాయాన భద్రతకు ఇది ముప్పు అని హెచ్చరించారు.ఈ ఆరోపణల నేపథ్యంలో, హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నామని, భారత నౌకలతో సహా అన్ని నౌకలు వెంటనే వెనక్కి వెళ్లాలని ఇరాన్ ఆదేశించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన ఆడియో రికార్డింగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను పెంచుతూ, భారత నౌకల భద్రతపైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# కౌటాలలో ఉచిత పాలీసెట్ కోచింగ్ సెంటర్ ప్రారంభం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలీసెట్-2026 ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్ రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామీణ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.చింతలమానేపల్లి మండలం ఎంఈఓ పసాల జయరాజ్ పాలీసెట్ పరీక్ష విధానం, ప్రిపరేషన్‌పైఅవగాహన కల్పించారు. ట్రస్ట్ ప్రతినిధులు రోజువారీ తరగతులు నిర్వహించి నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ అందిస్తామని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత కోచింగ్ కేంద్రాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నప్పటికీ, నిరంతర బోధన నాణ్యత, హాజరు పర్యవేక్షణ, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మేకల బాలకృష్ణ సేవలు కాంగ్రెస్ పార్టీకి ఎంతో మేలు చేశాయి... ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం తూముకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువ నాయకుడు, గ్రామ ఉపసర్పంచ్ మేకల బాలకృష్ణ రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తీవ్ర విషాదాన్ని కలిగించిందన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి శ్రీమతి అనిత మృతుని కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ఓదార్పు పలికారు. మేకల బాలకృష్ణ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాలకృష్ణ సేవలు ఎంతో మేలు చేశాయని, ఆయన అకాల మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.



హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

# కాగజ్‌నగర్‌లో ఓపెన్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలో ఓపెన్ 10వ తరగతి, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈఓ వాసాల ప్రభాకర్ తెలిపారు. మండలంలో 3 కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 549 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి 27 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారు. అన్ని కేంద్రాల్లో సిబ్బంది నియామకం, సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు

# రాళ్ల దాడితో రక్తపాతం... భూక్యా నరేష్‌పై సపవత్ నరేష్, సురేష్ దాడి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, మహబూబాబాద్ ప్రతినిధి:**
డోర్నకల్ మండలం తెల్లబండ గ్రామ తండాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన యువ నాయకుడు భూక్యా నరేష్‌పై అదే తండాకు చెందిన సపవత్ నరేష్, సపవత్ సురేష్, కలిసి దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. భూక్యా నరేష్ వెల్లడించిన వివరాల ప్రకారం, గ్రామ శివారులో జరిగిన బైక్ ప్రమాదం అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ఆకస్మికంగా సపవత్ నరేష్, సపవత్ సురేష్ దాడికి దిగారని తెలిపారు. రాళ్లతో దాడి చేయడంతో నరేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానికులు ఆయనను చికిత్స కోసం తరలించారు. ఈ దాడి ప్రణాళికతో జరిగిందని భూక్యా నరేష్ ఆరోపిస్తూ, తనపై దాడి చేసిన సపవత్ నరేష్, సురేష్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# శ్రీ దత్తాత్రేయ ఆలయంలో 20వ సారి భగవద్గీత పారాయణం ప్రారంభం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, నారాయణఖేడ్:**
నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలో ఉన్న శ్రీ దత్తాత్రేయ ఆలయంలో ప్రతి సోమవారం ఉదయం ప్రధాన అర్చకులు శ్రీ దత్తాత్రేయ స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఆలయంలో ప్రతిరోజూ భగవద్గీత పారాయణం జరుగుతుండగా, ప్రస్తుతం 20వ సారి పారాయణం కొనసాగుతోందని తెలిపారు. ప్రతి సోమవారం కాలభైరవ అష్టకం పారాయణం నిర్వహిస్తూ, శివుని ఉగ్రరూపమైన కాలభైరవుడిని స్మరించడం ద్వారా అజ్ఞానం, భయం, దుఃఖం తొలగి శక్తి లభిస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారని చెప్పారు. అలాగే ప్రతి మంగళవారం, శనివారం సాయంత్రం 7 గంటలకు హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించబడుతుందని, దీని ద్వారా భక్తులకు భక్తి, ధైర్యం పెరగడంతో పాటు అనారోగ్యం, శత్రువులు, కష్టాల నుండి దైవిక రక్షణ లభిస్తుందని నమ్మకం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహాశెట్టి శివలింగ పాటిల్, సభ్యులు ముత్యపు హనుమాన్లు, మహాశెట్టి కాశీనాథ్ పాటిల్, ముత్యాల మహేష్ కుమార్, పెండ్కర్ దీపక్, దారం కృష్ణమూర్తి, దత్తు సౌకారి, కిషన్ రావు, వెంకట్ రావు, బాబురావు, లక్ష్మయ్య, అశోక్, కృష్ణ సెట్, వడ్ల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. భగవద్గీత పారాయణం వినేందుకు, చదవడానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

# కాంగ్రెస్ నిరక్షరాస్యుల పార్టీ.. మరోసారి తేజస్వి సూర్య వివాదస్పద వ్యాఖ్యలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, సెంట్రల్ డెస్క్:**
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యలపై రేగుతున్న దుమారంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మరోసారి వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే తన మాటలను వక్రీకరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. నేను లోక్‌సభలో ఏం మాట్లాడానో మరోసారి కాంగ్రెస్ నేతలు శ్రద్ధగా వినాలి. నా మాటల్లోని అసలు అర్థాన్ని తెలుసుకోకుండా రాద్ధాంతం చేయడం సరికాదు. నేను మాట్లాడినవి చాలా సింపుల్ మాటలు. వీలైతే వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి అని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీని "నిరక్షరాస్యుల పార్టీ" గా అభివర్ణిస్తూ తేజస్వి సూర్య తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతలు ఉద్దేశపూర్వకంగా, లేదా అజ్ఞానంతోనే ఈ నిరసనలు చేస్తున్నారు. నా మాటలను తప్పుగా అర్థం చేసుకుని ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు అని తేజస్వి సూర్య కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా, ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై తేజస్వి సూర్య చేసిన కొన్ని వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఆయన వ్యాఖ్యలను తెలంగాణ ఆత్మగౌరవానికి భంగం కలిగించేవిగా అభివర్ణిస్తూ క్షమాపణలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే ఆయన తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని తెలుపుతూ, కాంగ్రెస్ తీరును తప్పుబట్టారు.

# 'లక్కీ ఫ్రెండ్స్ ఫ్యాషన్' షాప్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 19, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి పట్టణంలోని స్థానిక బస్టాండ్ ఏరియాలో 'లక్కీ ఫ్రెండ్స్ ఫ్యాషన్' నూతన షాపును మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు యజమాని సిరికొండ శివకుమార్ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ "వ్యాపారులు ప్రజలకు నాణ్యమైన వస్తువులను సరసమైన ధరలకు అందించాలి. కస్టమర్ల నమ్మకాన్ని నిలబెట్టుకుంటే వ్యాపారం అభివృద్ధి చెందుతుంది" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా షాపు యజమాని, కుటుంబ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్ ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు నజీర్ భాయ్, రఫీద్దీన్, సేవాదళ్ నాయకులు వాజిద్ భాయ్, కాంగ్రెస్ నాయకులు కూర శివకుమార్, సేవాదళ్ అధ్యక్షులు సామల రవీందర్, కరీం భాయ్, షాపు యజమాని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# కాఫీని ఏ సమయంలో తాగాలి..? ఎలా తాగితే మంచిది..?



కాఫీ తాగడం ఆరోగ్యానికి హానికరమనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. అయితే తాజా పరిశోధనలు, నిపుణుల సూచనల ప్రకారం కాఫీ గట్ (జీర్ణవ్యవస్థ), లివర్ ఆరోగ్యానికి కూడా మేలు చేయగలదని చెబుతున్నాయి. సుగంధభరితమైన రుచి కలిగిన ఈ పానీయం కెఫీన్ అనే సహజ ఉద్దీపన పదార్థం వల్ల తక్షణ శక్తిని అందిస్తుంది. అంతేకాకుండా పాలీఫినాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల శారీరక, మానసిక పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అయితే కాఫీ తాగేటప్పుడు కొన్ని ముఖ్యమైన విషయాలను గమనించడం అవసరం. కాఫీకి సంబంధించిన సరైన రకం, తాగే సమయం, పరిమాణం, అలవాట్లను దృష్టిలో ఉంచుకోవడం కూడా చాలా అవసరమని నిపుణులు చెబుతున్నారు.

**ఏ సమయంలో తాగాలి..**

అంతేకాకుండా అత్యంత ఆరోగ్యకరమైన కాఫీ రకం ఫిల్టర్ చేసిన బ్లాక్ కాఫీ అని, ఉదయం నిద్రలేచిన 60 నుండి 90 నిమిషాల తర్వాత కాఫీ తాగడం ఉత్తమ సమయమని, సాధారణంగా రోజుకు 1 నుంచి 3 కప్పులు మించకుండా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. కాఫీలో చక్కెర కలపకుండా తాగడం, అలాగే ఖాళీ కడుపుతో లేదా రాత్రి ఆలస్యంగా కాఫీ తీసుకోవడం నివారించడం ఆరోగ్యానికి అనుకూలం. ఇక అమ్లత్వం (అసిడిటీ) సమస్యలు ఉన్నవారికి తక్కువ ఆమ్లత కలిగిన కాఫీ, కోల్డ్ బ్రూ కాఫీ లేదా డీకాఫినేటెడ్ కాఫీ మంచిది. ఈ సూచనలు పాటిస్తే కాఫీ తాగడం మరింత ఆరోగ్యకరంగా మారుతుంది. అదేవిధంగా లివర్ ఆరోగ్యానికి కాఫీ ఎంతో ఉపయోగకరమని కూడా వారు పేర్కొంటున్నారు. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల ఇది లివర్‌ను రక్షించడంలో సహాయపడుతుంది.

**ఎలా తాగాలి..**

అలాగే కాఫీ మెదడు, గట్, లివర్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని, పాలీఫినాల్స్ మంచి బ్యాక్టీరియాను పెంచుతాయని, దృష్టి కేంద్రీకరణను మెరుగుపరుస్తాయని, అలాగే అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. మొత్తం మరణాల ప్రమాదాన్ని కూడా తగ్గించడంలో కాఫీ పాత్ర ఉండొచ్చని సూచించారు. అయితే చాలా మంది కాఫీ తాగేటప్పుడు కొన్ని పొరపాట్లు చేస్తున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చక్కెర ఎక్కువగా కలపడం, ఆర్గానిక్ కాఫీని ఎంచుకోకపోవడం, సరైన రోస్ట్ చేసిన కాఫీ గింజలను ఉపయోగించకపోవడం వంటి తప్పులు ఆరోగ్య ప్రయోజనాలను తగ్గిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.